క్లుప్తంగా

రూ.26.07 కోట్లతో సబ్‌స్టేషన్

మధిర: మండలంలోని మాటూరులో 33/11 కే.వీ. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.26.07 కోట్లు మంజూరయ్యాయి. ఈ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సోమవారం శంకుస్థాపన చేయనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించాక ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, నాయకులు చిలువేరు బుచ్చి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..



ఫాదర్‌ను సత్కరిస్తున్న సంఘస్తులు

వైరా: స్థానిక శాంతినగర్ హోలీ ట్రినిటీ చర్చిలో నాలుగేళ్లుగా ఫాదర్‌గా విధులు నిర్వహిస్తున్న రెవరెండ్ ఫాదర్ జ్వాన్నేసు బదిలీపై ఖమ్మం కరుణగిరి చర్చికి వెళ్తుండగా ఆదివారం చర్చిలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు శ్రీను, సురేష్, సుధాకర్, షాజీ మాధ్యు, దాస్, యోహాన్, ప్రకాశ్, చిరంజీవి, సిస్టర్ మీనా, ప్రదీప, సుమ, జసింత, యమున తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా వితరణ



దాతలను సత్కరిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం అంగన్‌వాడీ -1 కేంద్రానికి ఆదివారం కందిబండ బాలమురళి జ్ఞాపకార్థం ఆమె సతీమణి శైలజారాణి బీరువాను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ గుంటుపల్లి రాజేశ్వరి శైలజారాణిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ లతీఫ్, గుంటుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మకుండా చూడాలి

ముదిగొండ: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మకుండా చూడాలని రైతుసంఘం తెలంగాణ రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కందుల భాస్కర్‌రావు, కోలేటి ఉపేందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని సొసైటీల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు 75 శాతం రాయితీపై కల్పించాలని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాలను అధికారులు అప్పటికప్పుడు తనిఖీలు చేసి నకిలీలు సరఫరా కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వంద మంది బీపీ, షుగర్ బాధితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడుతూ... నాయకులు తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్య, వైద్యంతో పాటు సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్, ఏలూరి పూర్ణచందర్‌రావు, ఆకెన పవన్, యంగల గిరి, కిరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కారేపల్లి: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, అనుమతులు లేని, గ్రామాల్లో తిరుగుతూ అమ్మే వారి వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయొద్దని ఏఓ బి.అశోక్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి ఉన్న విత్తన దుకాణాల్లో ఎమ్మార్పీ ధరతో కొనుగోలు చేసి రశీదు పొందాలని, ప్యాకెట్ బ్యాగ్ నంబర్, కొనుగోలు చేసిన తేదీ, కంపెనీ పేరు వంటి విషయాలు రశీదులో వివరంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. విత్తనాల కొనుగోలుపై రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న 9550226672 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇక నాణ్యమైన విద్యుత్..

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు
- కోతలు, లో ఓల్టేజీ సమస్యలు తీరినట్లే..
- అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు, విద్యుత్ లైన్లు
- రూ. 15 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సక్సెస్



రూ.కోటి వ్యయంతో సత్తుపల్లి ఐడీపీఎస్‌లో ఏర్పాటు చేసిన భారీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: పట్టణాలు విస్తరిస్తుండటంతో ఏటా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. విద్యుత్ లోడ్ పెరగటంతో ఎన్నో ఏళ్లక్రితం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం సరిపడక విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజీ సమస్యలు, అరకొరగా ఫీడర్లు వంటి ఇబ్బందులతో ప్రజలు సతమతమవుతున్నారు. ఏళ్ల తరబడి పడుతున్న విద్యుత్ కష్టాలు తీరేలా ప్రభుత్వం ప్రత్యేక సమ్మర్ యాక్షన్‌ప్లాన్ చేపట్టింది. దీంతో సత్తుపల్లి డివిజన్‌లో ఇక మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భవిష్యత్ జనాభా పెరుగుదల అవసరాల దృష్ట్యా అందుకు అనుగుణంగా పెరిగే విద్యుత్‌లోడ్‌కు తగ్గట్టుగా సబ్‌స్టేషన్లతో పాటు భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, కెపాసిటర్లు, ఫీడర్లను బలోపేతం చేస్తున్నారు. సుమారు రూ.15 కోట్లతో డివిజన్‌లో విద్యుత్ ఆధునికీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నడుస్తున్నాయి.

ప్రణాళికాయుతంగా పనులు..

వేసవిలో లోడ్‌కు తగ్గట్టుగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సత్తుపల్లి డీఈఈ ఎల్.రాములు ఆధ్వర్యాన విద్యుత్ అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టారు. మండుటెండల్లో సైతం విద్యుత్ ఆధునీకరణ పనుల్లో విద్యుత్ శాఖ యంత్రాంగం నిమగ్నమైంది.

రూ.2.50 కోట్లతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు..

సమ్మర్ లోడ్‌ను తట్టుకునే విధంగా రూ.2.50 కోట్ల వ్యయంతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు చేపట్టారు. డివిజన్‌లో వివిధ సామర్థ్యాలతో 132 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. మరో రూ.5 కోట్లతో 57.8 కిలోమీటర్ల మేరా 33 కేవీ విద్యుత్ లైన్లను కందుకూరు-కిష్టాపురం, మర్లపాడు-బీరాపల్లి, లింగపాలెం, తోగ్గూడెం, బుగ్గపాడు-నాగుపల్లి, బత్తుపల్లి, తిమ్మారావుపేట-ముచ్చర్లలలో విద్యుత్ లైన్లకు చర్యలు చేపట్టారు.

మున్సిపాలిటీలో ప్రత్యేకంగా..

సత్తుపల్లి మున్సిపాలిటీలో సత్తుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మూడు ఫీడర్లు ఏర్పాటు చేసి ఐడీపీఎస్ సబ్‌స్టేషన్‌తో లింక్ అనుసంధానం చేశారు. ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ఐడీపీఎస్ సబ్‌స్టేషన్‌లో ఏమైనా సమస్యలు వస్తే సత్తుపల్లి సబ్‌స్టేషన్ నుంచి పవర్ ఇచ్చే విధంగా ఇక్కడ ఈ సబ్‌స్టేషన్‌లో సమస్య వస్తే ఐడీపీఎస్ నుంచి పవర్ వచ్చే విధంగా నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టారు.

సాంకేతిక పరిజ్ఞానంతో..

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసే భారీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాలను పెంచుతున్నారు. రూ.5 కోట్ల అంచనాతో మిట్టపల్లి, జన్నారం(ఏన్కూరు), మర్లకుంట, సత్తుపల్లి ఐడీపీఎస్, పెద్ద కోరుకొండిల్లో పీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. ఇంకా లంకపల్లి, గౌరారం, బీరాపల్లి, లంకాసాగర్‌లలో వీటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.



పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు (ఫైల్)

బ్రేకర్స్‌తో పటిష్టం..

సబ్‌స్టేషన్లలో ప్రత్యేకంగా గతంలో రెండు ఫీడర్లు కలిపి బ్రేకర్ ఉండేది. ఇప్పుడు ప్రత్యేకంగా రూ.కోటి వ్యయంతో ఒక్కో ఫీడర్‌కు ఒక్కో ఫీడర్‌ను ఏర్పాటు చేశారు. ఇలా తుమ్మలపల్లి సబ్‌స్టేషన్, బీరాపల్లి, మిట్టపల్లి, బత్తుపల్లి, పెద్ద కోరుకొండి, జన్నారం సబ్‌స్టేషన్‌లలో బ్రేకర్లు ఏర్పాటు చేశారు. నాచారం, లంకాసాగర్‌లలో ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

డివిజన్ వారీగా..

గృహ విద్యుత్ సర్వీస్‌లు	1,05,970
పరిశ్రమల విద్యుత్ సర్వీస్‌లు	96
చిన్న పరిశ్రమల సర్వీస్‌లు	709
కుటీర పరిశ్రమల సర్వీస్‌లు	128
వ్యవసాయ సర్వీస్‌లు	3,5185
వీధి దీపాలు	1,279
వాణిజ్య సర్వీస్‌లు	12,899

అంతరాయం లేని సరఫరా కోసం..



పాత సబ్‌స్టేషన్లు అన్నింటిని మళ్లీ ఆధునీకరించటానికి పనులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపడతాం. లింగాల, అన్నారుగూడెంలలో కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు పూర్తయ్యాయి. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఎల్.రాములు, డీఈఈ, సత్తుపల్లి

రేపటి నుంచి భూభారతి సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాబు

మధిర: మండలంలోని 25 రెవెన్యూ గ్రామాల్లో మంగళవారం నుంచి ఈనెల 18 వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రాళ్ల బండి రాంబాబు తెలిపారు. ఈ మేరకు మధిర తహసీల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సభల్లో ఇచ్చిన దరఖాస్తులపై ఆగస్టు 15లోగా పరిష్కారాలు ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం జాలిముడి, మల్లారం, 4న ఎండపల్లి, సిరిపురం, రొంపిమల్ల, 5న వంగవీడు, మునగాల, 6న ఆత్కూరు, మాటూరు, 9న నాగవరప్పాడు, సిద్దినేనిగూడెం, 10న నక్కలగరుబు, దిడుగుపాడు,11న మధిర, ఇల్లెందులపాడు, 12న తొండల గోపవరం, తొర్లపాడు, 13న అంబారుపేట, నిదానపురం,16న రాయపట్నం, ఇల్లూరు, 17న చిలుకూరు, ఖమ్మంపాడు, 18న మడుపల్లి, దెందుకూరు గ్రామాల్లో సదస్సులు ఉంటాయని తెలిపారు.

కొణిజర్ల: మండలంలో మంగళవారం తనికెళ్ల, అమ్మపాలెం, 4న తుమ్మలపల్లి, గోపతి, 5న గుండ్రాతిమడుగు మునగాల, 6న గుబ్బగుర్తి, కొణిజర్ల, 9న లింగగూడెం, సింగరాయపాలెం, 10న మల్లుపల్లి, యాతకుంట్ల, 11న శివారు వెంకటాపురం, కాచారం, 12న కొండవనమాల, 13న గోపవరం, 16న దిద్దుపూడి, 17న పల్లిపాడు గ్రామాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ జి.రాము తెలిపారు.

ఏన్కూరు: మండలంలో 3న ఏన్కూరు, జన్నారం, 4న గార్లొడ్డు, జన్నారం, 5న టీఎల్‌పేట, బీఆర్ పురం, 6న బీఎస్‌తండా, రాజలింగాల, 9న శ్రీరాంగిరి, మూలపోచారం, 10న కేసుపల్లి, తిమ్మరావుపేట, 11న నూకాలంపాడు, ఎర్రబోడు తండా, 12న నాచారం, రాయమాదారం, 13న రేపల్లెవాడ, సూర్యాతండా, 16న హిమాంనగర్, మేడేపల్లి, 17న ఆరికాయలపాడు గ్రామాలలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరకాస్తులు తీసుకోనున్నట్లు తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు.

తల్లాడ: మండలంలో ఈ నెల 3 నుంచి 19 వ తేదీ వరకు భూ భారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 వ తేదీన అన్నారుగూడెం, బస్వాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ప్రారంభించి 27 పంచాయతీల్లో 19వ తేదీలోగా ముగుస్తాయన్నారు. రెతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైరారూరల్: మండలంలో మంగళవారం నుంచి 17 వరకు సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్నానాల లక్ష్మీపురం, గన్నవరం, 4న ముసలిమడుగు, గోవిందపురం, 5న స్టేజీ పినపాక, పూసలపాడు, ఖానాపురం, 6న సిరిపురం, కొండకొడిమ, 9న పుణ్యపురం, రెబ్బవరం, 10న నారపునేనిపల్లి, గొల్లపూడి, 11న విప్పలమడక, పాలడుగు, 12న లింగన్నపాలెం, వల్లాపురం, 3న గరికపాడు, అష్ణగుర్తి, మేడిబండ, 16న దాచాపురం, గొల్లెనపాడు, 17న బ్రహ్మణపల్లి, తాటిపూడి, 18న సోమవరం, కోస్తాల పంచాయతీలో గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషాశారద


ఎర్రుపాలెం: మండలంలో 3న ములుగుమాడు, సఖినవీడు, 4న జమలాపురం, వెంకటాపురం, 5న రామన్నపాలెం, ఇనగాలిలో, 6న రాజుపాలెం, నారాయణపురం, గట్లగౌరారం, 9న తక్కెళ్లపాడు, మీనవోలు, 10న కాచారం, గుంటుపల్లిగోపవరం, 11న భీమవరం, అయ్యవారిగూడెం, భీమవరం హరిజనవాడ, 12న లక్ష్మీపురం, మామునూరు, 13న బుచ్చిరెడ్డిపాలెం, నర్సింహాపురం, 16న చొప్పకట్లపాలెం, రాజులదేవరపాడు, 17న కంద్రిక, బంజర, పెద్దగోపవరం, 18న బనిగండ్లపాడు, పెగళ్లపాడు, 19న ఎర్రుపాలెం, తెల్లపాలెం గ్రామాల్లో, 20న రేమిడిచర్ల, కొత్తపాలెం, రామాపురం గ్రామాల్లో సదస్సులను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఉషాశారద తెలిపారు.

రేపు మంత్రుల చేతుల మీదుగా ప్రారంభం

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు గ్రామంలో మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూ భారతి రెవెన్యూ ప్రారంభించనున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. భూభారతి రీ సర్వే ప్రోగ్రాం పైలట్ ప్రాజెక్టు గ్రామంగా ఇప్పటికే ఆ గ్రామంలో భూముల రీసర్వే, నక్ష తయారీ చేసే ప్రక్రియ కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థికసాయం

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో పేరబత్తిని కుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ ఎంపీటీసీ సంద్ర శ్రీలక్ష్మీ కిరణ్ ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. గత్తం బాలరాజు, వెంకట్రావు, భూషి, శివాజీ, సంజీవరావు, భూపాల్, సతీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీలక్ష్మీ కిరణ్

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

చింతకాని: మండలపరిధిలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన సింగారపు నవ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సిఫారసుతో రూ.20 వేలు మంజూరు కావడంతో కృతజ్ఞతలు తెలిపారు. కొండపరెడ్డి రవీందర్‌రెడ్డి, ఆనం ప్రభాకర్‌రెడ్డి, ఇనుకుర్ల నాగసూరారెడ్డి, లింగం రాంబాబు, సింగారపు నాగేంద్రబాబు, తాళ్లూరి నాగరాజు, లింగం రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

'దేశంలో అసమానతలు సృష్టిస్తున్న బీజేపీ'

కల్లూరు: నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసమానతలు పెరుగుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో పేదరికం 17 శాతానికి పెరిగిందన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి తక్షణమే వాటి స్థానంలో పాత 44 చట్టాలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, నాయకులు దామాల దయాకర్‌రావు, శాదరాజపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజనేయులు

కట్ట ఈసారైనా ఆగేనా..?

ముదిగొండ: మండలపరిధిలోని వల్లభి సమీపంలోని బోటికుంట చెరువు కట్ట మరమ్మతులు జరుగుతున్నాయి. గతేడాది వర్షాకాలంలో వచ్చిన వరదలకు గండిపడి కొట్టుకుపోయింది. దీంతో ఆర్అండ్‌బీ రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామస్తుల ఫిర్యాదులతో డిప్యూటీ సీఎం విక్రమార్క అక్కడి పరిస్థితిని పరిశీలించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో పక్కనే ఉన్న చెరువు మట్టితో కొట్టుకుపోయిన మట్టితో కట్టను పటిష్టపరుస్తున్నారు. పనులను ఇరిగేషన్ డీఈ సహ పరిశీలించారు. ఆ పనులు నత్తనడకన సాగడమే కాకుండా నాణ్యతతో చేపట్టడం లేదని ఆరోపణలొచ్చాయి. నల్లరేగడి మట్టితో పచ్చగడ్డి ఉన్న మట్టిని నింపుతున్నట్లు పరిశీలించిన డీఈ వాటి తొలగించాలని చెప్పినా తొలగించకపోవడం గమనార్హం.



బోటి కుంట చెరువుకట్ట పనులు నిర్వహిస్తున్న దృశ్యం

సేవతోనే ఉద్యోగులకు గుర్తింపు



వెంకటరామిరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: ప్రభుత్వ ఉద్యోగులకు సేవ చేసినప్పుడే సరైన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. వైరా గృహనిర్మాణ సంస్థ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా 41 ఏళ్ల పనిచేసి శనివారం పదవీ విరమణ పొందిన బొగ్గుల వెంకటరామిరెడ్డి సన్మాన సభ ఆదివారం వైరాలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, కట్ల రంగారావు, శీలం వెంటకనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

వైరా మండలంలోని కొండకొడెమ గ్రామంలో 23 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు గాను గ్రామస్తులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, అశోక్, కరుణ, అచ్చాలు, రామారావు, రాధాకృష్ణ, రజని పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న బషీరుద్దీన్

తల్లాడ: గంజాయి, డ్రగ్స్, చెడు వ్యసనాలతో యువత ఆరోగ్యం దెబ్బతింటుందని వాటికి దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య యాత్ర ఆదివారం కుర్నవల్లి, కేశ్వాపురం, తల్లాడ, అన్నారుగూడెం, నరసింహారావుపేట వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మండలకేంద్రంలో మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి డీవైఎఫ్ఐ జెండాను ఎగురువేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో యువత ఉద్యోగం ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వాలు స్పందించి యువత సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్తెనపల్లి నరేష్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వర్‌రావు, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం నాయకులు తిరుపతరావు, ఎన్.మోహన్‌రావు, చింతల రమేష్, శీలం వీరబాబు, బొడ్డు మధు, ముత్తారావు, సాయికుమార్, రావులపాటి నాగరాజ్, సైదులు, ధీరజ్ పాల్గన్నారు.

ఏన్కూరు: డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర ఏన్కూరు మండలకేంద్రానికి చేరుకోగా సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాణోత్ బాలాజీ, జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు దొంతెబోయిన నాగేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. నాయకులు ఇటికల లెనిన్, భూక్యా బచ్చు, తమ్మినేని వెంకటయ్య దొంతబోయిన వెంకటేష్, గుడ్ల వెంకటేశ్వరు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వైరా: అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు



వేంసూరులో..



చింతకాని: కొదుమూరులో..

వైరా: వైరాలోని ఠాగూర్ విద్యాసంస్థల క్రాంతి జూనియర్ కళాశాల 2003-05 ఇంటర్ బ్యాచ్ సీఈసీ, హెచ్ఈసీ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, చైర్మన్ వాసిరెడ్డి సునీత, అధ్యాపకులు సంక్రాంతి భాస్కర్‌రావు, మహ్మద్ రఫీ, బోడపట్ల రవీందర్, గుడిమెట్ల మోహనరావు, పారుపల్లి చంద్రశేఖర్‌రావు, లింగమూర్తి, వినోద్, నాగలక్ష్మి, చింతనిప్పు కృష్ణారావు పాల్గొన్నారు.

వేంసూరు: వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని నాటి గురువులను సన్మానించుకున్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బికె.నరసింహారావు, అప్పటి ఉపాధ్యాయులు శాంత కుమారి, కేశవరెడ్డి, రాంమోహన్‌రావు,పూర్వ విద్యార్థులు బూరుగు శాంతి, జయశంకర్, కంచర్ల రవి, సత్యనారాయణ, రాజేష్, గోపి, రాజశేఖర్, రాంబాబు, పుల్లారావు, దుర్గారావు, జానీ, సుజాత, సునీత, మాధవి పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిధిలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2013-2014 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేసి, అప్పటి గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల మర్రి.. సేద దీరేందుకు డోంట్ వర్రీ!



అమ్మపేటలో వల్లాపురం రహదారి పక్కనే మర్రిచెట్టు

ముదిగొండ: మండలపరిధిలోని అమ్మపేటలో శివాలయం ఎదురుగా ఉన్న వందేళ్ల నాటి మర్రిచెట్టు చక్కటి చల్లదనాన్నిస్తుంటుంది. అమ్మపేట-వల్లాపురం రహదారి మధ్యన ఉన్న ఈ ఊడల మర్రి పెద్ద వృక్షంగా మారి కొమ్మలతో దాదాపు వంద మందికి అలసట దీరేందుకు ఆసరాగా ఉంది. మండలంలోని పలు గ్రామాల ప్రజల ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచే పోయే ప్రయాణికులకు ఈ మర్రిని చూడగానే ఒక్క నిమిషం ఆగాలనిపిస్తుంటుంది. చెట్టు కింద కూర్చోవడానికి దాతలు విశ్రాంతి బల్లలు కూడా అమర్చారు. రహదారి పక్కనే గుడికి ఎదురుగా ఉండడంతో ఆహ్లాదకర వాతావరణంలో కూర్చుని ఆనందం వ్యక్తం చేస్తుంటారు.